సాక్షి నిజామాబాద్

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



నిలకడగా ఎస్సారెస్పీ..
ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు, ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటితో ఎస్సారెస్పీలో నీటిమట్టం నిలకడగా ఉంది.
- IIలో ▸



పండుగ పూట పస్తులేనా..?
ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు నెలల తరబడి కూలి చెల్లింపులు నిలిచిపోయాయి.
- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.



జిల్లాలో దేవీశరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నిజామాబాద్ నగరంలోని గాజుల్‌పేట్ యూత్ మండపంలో శనివారం అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

బీసీ మహిళకే జెడ్పీ పీఠం

రిజర్వేషన్లు ఖరారు
- జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల వివరాలు ప్రకటించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు సైతం
- ఎన్నికల నోటిఫికేషన్ రావడమే తరువాయి..
- ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిన యంత్రాంగం

స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు దక్కనుంది. ఇందుకు సంబంధించి రిజర్వేషన్ ఖరారు చేస్తూ ప్రభుత్వం శనివారం గెజిట్ జారీ చేసింది. మరోవైపు జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలతోపాటు ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను అధికారులు ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్ స్థానాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ విడుదల చేసింది. మరోవైపు కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 31 మండలాలకు ఖరారైన రిజర్వేషన్లతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్నలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ చేస్తూ, నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల కేటాయించినట్లు వివరించారు.



■ జిల్లాలోని మొత్తం 31 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఎస్టీలకు మూడు స్థానాలు రిజర్వు కాగా, ఇందులో ఒకటి మహిళలకు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీలకు ఐదు జెడ్పీటీసీ స్థానాలు రిజర్వు కాగా, మహిళలకు రెండు స్థానాలు కేటాయించారు. బీసీలకు 13 స్థానాలు రిజర్వు కాగా, ఇందులో ఆ రు స్థానాలు మహిళలకు కేటాయించారు. మిగిలిన 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, ఇందులో ఐదు స్థానాలు మహిళలకు కేటాయించారు.

■ జిల్లాలోని 31 ఎంపీపీ స్థానాలకు గాను ఎస్టీలకు మూడు స్థానాలు రిజర్వు అయ్యాయని, ఇందులో ఒకటి మహిళలకు రిజర్వు చేసినట్లు కలెక్టర్ తెలి పారు. ఎస్సీలకు ఐదు ఎంపీపీ స్థానాలు రిజర్వు కాగా, ఇందులో మహిళలకు రెండు స్థానాలు కేటా యించారు. బీసీలకు 13 స్థానాలు రిజర్వు కాగా, ఇందులో ఆరు స్థానాలు మహిళలకు కేటాయించారు. మిగిలిన 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, ఇందులో ఐదు స్థానాలు మహిళలకు కేటాయించారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు నివేదించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

■ ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు రిజర్వేషన్లు ప్రకటించారు.

■ అయితే బీసీ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో రిజర్వేషన్లు ఎలా కేటాయింపులు చేస్తారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ తరుణంలో నోటిఫికేషన్ విషయమై ఉత్కంఠ నెలకొంది.

జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ వివరాలు

మండలం	జెడ్పీటీసీ	ఎంపీపీ
ఆలూరు	ఎస్సీ (మహిళ)	ఎస్సీ
ఆర్మూర్	జనరల్ (మహిళ)	జనరల్ (మహిళ)
బాల్కొండ	జనరల్	జనరల్ (మహిళ)
భీంగల్	జనరల్ (మహిళ)	బీసీ (మహిళ)
బోధన్	ఎస్సీ	ఎస్సీ
చందూర్	జనరల్ (మహిళ)	జనరల్ (మహిళ)
ధర్పల్లి	ఎస్టీ (మహిళ)	ఎస్టీ
డిచ్‌పల్లి	బీసీ	బీసీ
డొంకేశ్వర్	ఎస్సీ (మహిళ)	ఎస్సీ (మహిళ)
ఇందల్వాయి	ఎస్టీ	బీసీ (మహిళ)
జక్రాన్‌పల్లి	బీసీ	బీసీ
కమ్మర్‌పల్లి	జనరల్	జనరల్
కోటగిరి	బీసీ (మహిళ)	బీసీ
మాక్లూర్	బీసీ (మహిళ)	బీసీ (మహిళ)
మెండోరా	బీసీ (మహిళ)	బీసీ
మోర్తాడ్	బీసీ (మహిళ)	బీసీ (మహిళ)
మోస్రా	బీసీ (మహిళ)	బీసీ
మోపాల్	బీసీ	జనరల్
ముప్కాల్	ఎస్సీ	ఎస్సీ
నందిపేట్	బీసీ	బీసీ (మహిళ)
నవీపేట్	బీసీ	జనరల్ (మహిళ)
నిజామాబాద్	జనరల్	ఎస్టీ
పోతంగల్	బీసీ	బీసీ
రెంజల్	జనరల్	జనరల్
రుద్రూర్	జనరల్ (మహిళ)	జనరల్
సాలూర	ఎస్సీ	ఎస్సీ (మహిళ)
సిరికొండ	జనరల్	జనరల్
వేల్పూర్	బీసీ	బీసీ
వర్ని	ఎస్టీ	ఎస్టీ (మహిళ)
ఎడపల్లి	జనరల్ (మహిళ)	జనరల్ (మహిళ)
ఏర్గట్ల	బీసీ (మహిళ)	బీసీ (మహిళ)



ఖరారైన రిజర్వేషన్లు ప్రకటిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, హాజరైన రాజకీయ ప్రతినిధులు

న్యూస్‌రీల్

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం



నిజామాబాద్ రూరల్: సాంకేతిక స్వావలంబనలో భాగంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారని నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల బీఎస్ఎన్ఎల్ జీఎం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఎస్ఎస్ఎల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి బిజినెస్ పరంగా ఉమ్మడి జిల్లాలకు కలుపుకొని 2జీ, 3జీలను కవర్ చేస్తుందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా 4జీ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. రూ.87 కోట్ల వ్యయంతో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 4జీ సేవలు అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్ఏ డీజీఎం విజయ్‌కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

'నిజాంసాగర్' 15 గేట్లు ఎత్తివేత



నిజాంసాగర్(జుక్కల్): కర్ణాటక, మహారాష్ట్రలో కుండపోత వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు కౌలాస్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. అలాగే జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సింగితం రిజర్వాయర్, నల్లవాగు మత్తడితోపాటు పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నాయి.

సింగూరు నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్‌లోకి శనివారం 1,09,470 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 15 గేట్ల ద్వారా 1,10,702 క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి విడుదల చేస్తున్నారు.

కౌలాస్ ప్రాజెక్టు నుంచి..
కౌలాస్ ప్రాజెక్టులోకి 10,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 5 గేట్ల ద్వారా 12,522 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

వేగంగా పంటల నమోదు

- ఇప్పటి వరకు 3.55 లక్షల ఎకరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ



క్రాప్ బుకింగ్ నమోదు చేస్తున్న డీఏవో

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో పలు చోట్ల పంట కోతలు మొదలవగా, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యే నాటికి డిజిటల్ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో వ్యవసాయాధికారులు వేగంగా పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 5.25 లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి 4.36 లక్షల ఎకరాలకు పైగా ఉంది. ప్రస్తుతం మొక్కజొన్న, సోయా, పప్పుదినుసుల పంట కోతలు మొదలయ్యాయి. డీసీఎస్ పోర్టల్‌లో ఎంట్రీ చేస్తున్న డేటా ప్రకారమే ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3.55 లక్షల ఎకరాల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. అక్టోబర్ 20 నాటికి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తి చేయాలని గడువు విధించింది.

మున్సిపల్ టూ మహిళా శిశుసంక్షేమ శాఖ ఈవో



ఆర్. మౌనిక

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శనివారం ప్రకటించిన మహిళా శిశు సంక్షేమ శాఖ విస్తరణ అధికారి పరీక్ష ఫలితాల్లో బోధన్‌కు చెందిన ఆర్. మౌనిక ఎంపికైంది. ఆమె గ్రూప్–4లో ఉత్తీర్ణత సాధించి బోధన్ మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుంది. తండ్రి అప్పల నాయుడు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. తల్లి కమల కుమారి ఆధ్యాత్మిక శిక్షకురాలిగా ఉన్నారు.



కిక్కిరిసిన నవీపేట మేకల సంత

- దసరా నేపథ్యంలో జోరుగా కొనుగోళ్లు
- రూ. 3కోట్లకు పైగా లావాదేవీలు

నవీపేట: మండల కేంద్రంలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. అక్టోబరు 2న దసరా ఉండడంతో ఈ సంతలో క్రయవిక్రయాలు ఊపందుకున్నాయి. సంత ప్రాంగణం బురదమయంగా మారడంతో చుట్టుపక్కల రహదారులు, బస్టాండ్ ఆవరణలో జోరుగా క్రయవిక్రయాలు జరిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పోలీసులు క్లియర్ చేశారు. సుమారు రూ. 3 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

త్యాగశీలి 'కొండా లక్ష్మణ్ బాపూజీ'

నిజామాబాద్ సిటీ: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగశీలి అని వక్తలు కొనియాడారు. తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ కులసంఘాల ప్రతినిధులు వినాయక్‌నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో సైతం కొండా లక్ష్మణ్ బాపూజీ పాల్గొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోతకు ముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న డీసీవో శ్రీనివాస్

- జిల్లా సహకార అధికారి శ్రీనివాస్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): వరి పంట కోతకు ముందుగానే సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా సహకార అధికారి (డీసీవో) శ్రీనివాస్ సూచించారు. సహకార, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం కొనుగోలు కోసం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు శనివారం డిచ్‌పల్లి పీఏసీఎస్‌లో నిజామాబాద్ డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో డబ్బులు చెల్లించాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ సత్యనారాయణ, మానిటరింగ్ ఆఫీసర్లు మయూరి, లావణ్య, మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలు, సహకార సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వేదికలపై ఆర్మూర్ 'గజ్జె'

- దేశ, విదేశాల్లో చిన్నారుల కూచిపూడి ప్రదర్శనలు
- విదేశీయుల మెప్పు పొందుతున్న ఆర్మూర్ కళాకారులు
- జూన్‌లో దుబాయిలో ప్రదర్శన ఇచ్చిన చిన్నారులు
- 28, 29వ తేదీల్లో మలేషియాకు ఆహ్వానం

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం కూచిపూడి నృత్యం. ఈ కళకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు ఆర్మూర్ కళాకారులు. ప్రత్యేక శ్రద్ధతో నేర్చుకొని దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తున్నారు. అందం, అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తూ.. అసాధారణ ప్రతిభతో భారతీయ నృత్యం ఔన్నత్యాన్ని ప్రపంచ నలుమూలల చాటుతున్నారు. తాజాగా మలేషియా వేదికపై ఈ నెల 28, 29 తేదీల్లో ప్రదర్శన ఇవ్వనున్న నటరాజ నృత్యానికేతన్ కళాకారులపై ప్రత్యేక కథనం.. – ఆర్మూర్

సండే స్పెషల్



ఈ ఏడాది జూన్‌లో దుబాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శననిచ్చిన నటరాజ నృత్యనికేతన్ కళాకారులు (ఫైల్)

ఆర్మూర్ పట్టణంలోని నటరాజ నృత్యనికేతన్‌లో కూచిపూడి శిక్షణ పొందిన చిన్నారులు దేశ విదేశాల్లో తమ నాట్య ప్రదర్శనలతో వీక్షకులను ఆకట్టుకుంటున్నారు. యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ ద్వారా స్పాన్సర్‌షిప్ ఇస్తూ ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. పట్టణానికి చెందిన మాడవేటి నారాయణ స్థాపించిన నటరాజ నృత్యనికేతన్‌లో నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మృణాళిని శిష్యరికంగా చిన్నారులు కూచిపూడి, జానపద నృత్య రీతులు, పేరిణి నాట్యాన్ని అభ్యసిస్తూ నాట్య మయూరాలుగా పేరొందారు. తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నాట్య గురువు శ్రమ తోడవడంతో వీరి ప్రతిభను చాటి చెప్పడానికి స్పాన్సర్స్ సైతం స్వచ్ఛందంగా ముందుకు రావడం ప్రత్యేకత సంతరించుకుంది. గత జూన్ 8న దుబాయిలో యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్‌అండ్‌కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నృత్యనికేతన్‌కు చెందిన 8 మంది చిన్నారులు ఆంధ్రనాట్యం, కూచిపూడి ప్రదర్శననిచ్చారు. తాజాగా ఈ నెల 28, 29వ తేదీల్లో మలేషియాలో యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్‌అండ్‌కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నారు. ఈ వేదికపై తమ శిష్యులతోపాటు వచ్చి ప్రదర్శననివ్వాల్సిందిగా నాట్య గురువు డాక్టర్ మృణాళినితోపాటు 12 మంది చిన్నారులకు నిర్వాహకులు దేవులపల్లి పవన్ ఆహ్వానం పంపించారు. దీంతో సాయి శృతి, వైష్ణవి, హయాతి, సాన్నిధ్య, ప్రియాన్షి, పావని, శ్రీనిధి, శ్రీవల్లి, నిశ్రుత, అనన్య, శ్రీలేఖ, నివృతి మలేషియాకు పయనమయ్యారు.

విదేశాలకు పరిచయం చేస్తున్నాం



దేశంలోని నృత్య రీతులను విదేశీ వేదికలపై ప్రదర్శించడం ద్వారా మన సంస్కృతిని వారికి పరిచయం చేసినట్లు అవుతోంది. ఇది చాలా సంతోషాన్నిస్తోంది. దేశ విదేశాల్లో ఇప్పటికి వర కు 80 పైగా ప్రదర్శనలిచ్చాను. మరోమారు మలేషియాకు వెళ్లడం ఆనందంగా ఉంది.
– బాశెట్టి సాయి శృతి, నాట్య కళాకారిణి, ఆర్మూర్

గర్వంగా ఉంది..



మా నాట్య గురువు ప్రదర్శనతో దుబాయిలో విజయవంతంగా ప్రదర్శననిచ్చిన మేము మలేషియాకు సైతం వెళ్లనుండటం చాలా గర్వంగా ఉంది. విదేశాల్లో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చేందుకు సన్నద్ధమవుతాం. – పద్మ తన్వి, నాట్య కళాకారిణి, ఆర్మూర్

మరిచిపోని ప్రదర్శన..



మా నాట్య గురువు మృణాళిని శ్రమ, కృషితోనే దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చే అవకాశం వస్తుంది. ఇది చాలా తృప్తినిస్తోంది. మాకు మరిచిపోని ప్రదర్శనగా నిలవనుంది.
– దూంపేట హయాతి, నాట్య కళాకారిణి, ఆర్మూర్

విదేశీయులు ఆదరిస్తున్నారు..



గల్ఫ్ దేశాలతోపాటు మలేషియా లాంటి దేశాల్లో భారతీయ నృత్య రీతులను ఆదరిస్తున్నారు. అందుకే వారే స్పాన్సర్లుగా వ్యవహరిస్తూ మాకు ఎలాంటి ఖర్చు కాకుండా ప్రదర్శనలకు తీసుకెళ్లడం చాలా ఆనందంగా ఉంది. – శ్రీరాం వైష్ణవి, నాట్య కళాకారిణి, ఆర్మూర్

శ్రద్ధగా నేర్చుకుంటున్నాం..



విదేశాల్లో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలపై మరింత గౌరవం పెరగాలనే సంకల్పంతో మరింత శ్రద్ధగా కూచిపూడిలో శిక్షణ పొందుతున్నాం. చాలా గర్వంగా ఉంది.
– సాన్నిధ్య, నాట్య కళాకారిణి, ఆర్మూర్

క్లుప్తంగా

మళ్లీ తెగిన అంతర్రాష్ట్ర వంతెన రోడ్డు



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి వద్ద గోదావరి నది ఎట్టకేలకు నాలుగు రోజుల తర్వాత శాంతించింది. కొన్ని రోజులుగా అంతర్రాష్ట్ర వంతెన పైనుంచి పరవళ్లు తొక్కుతూ ప్రవహించిన నది శనివారం వంతెన కింది నుంచి ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెన పైనుంచి వరద ప్రవహించగా బీటి రోడ్డు ధ్వంసమైంది. వెంటనే మహారాష్ట్ర అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేసి నిలిచిపోయిన రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలను పునురుద్ధరించారు. మూడు రోజులుగా వరద ప్రవాహం భారీగా రావడంతో కంకర రోడ్డు మళ్లీ కొట్టుకపోయింది. తిరిగి రోడ్డు పూర్తిచేసే వరకు రాకపోకలను నిలిపి వేస్తామని అధికారులు పేర్కొన్నారు. వంతెన వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు చెక్‌పోస్టు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజాంకు వ్యతిరేకంగా, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా విఠల్‌రావు మాట్లాడుతూ.. నిఖార్సైన తెలంగాణవాదిగా ఉద్యమించిన కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేశారన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిర్ప రాజు, కొత్తూరు లక్ష్మారెడ్డి, రమణరావు, చింత మహేష్, చింతకాయల రాజు, నీలం రెడ్డి, శ్రీనివాస్, కాంతారావు, జలపతిరావు, కుమార్, సాదిక్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పండుగ పూట పస్తులేనా..?

- ఉపాధిహామీ పథకం కూలీలకు నాలుగు నెలలుగా అందని కూలి సొమ్ము
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వైనం



మోర్తాడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు నెలల తరబడి కూలి సొమ్ము చెల్లింపులు నిలిచిపోయాయి. ఒక వారంలో పని చేసిన కూలీలకు మరుసటి వారంలో లేదా పక్షం రోజుల్లోనే చెల్లింపులు చేయాలని ఉపాధి హామీ చట్టంలోనే నిర్దేశించారు. కానీ నాలుగు నెలలుగా కూలీలకు వారు చేసిన పనులకు కూలి చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో రూ.16 కోట్ల బకాయిలు..

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 2.50లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎండకాలంలో రోజుకు సగటున లక్ష మంది వరకూ కూలీలు ఉపాధి పనులు చేసేవారు. జూన్, జూలై మాసాల్లో వర్షాలు అంతగా కురవకపోవడంతో వన మహోత్సవ కార్యక్రమంలో కూలీలు పాలుపంచుకున్నారు. అప్పట్లో రోజుకు 50వేల మంది వరకు కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. మే 22 వరకు చేసిన ఉపాధి పనులకే కూలి సొమ్మును చెల్లించారు. అప్పటి నుంచి పనిచేసిన పనులకు నిధులు నిలిచిపోయాయి. దీంతో ఇప్పటి వరకూ జిల్లాలోని ఉపాధి కూలీలకు రూ.16 కోట్ల బకాయిలు పేరుకపోయాయి.

కేంద్ర ప్రభుత్వమే నేరుగా..

రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే అందులో నుంచి కూలీలకు సొమ్మును జమ చేసేవారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను పక్కదారి పట్టిస్తుందనే ఉద్దేశంతో కూలీలకే సొమ్మును నేరుగా జమ చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కూలీల ఖాతా నంబర్లను సేకరించి వారికి తపాల శాఖ, బ్యాంకు ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు ఉపాధి కూలీల కూలి సొమ్ము చెల్లింపుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా కేంద్రం నిధులను విడుదల చేయడం లేదు. దసరా పండుగ వస్తుండగా నాలుగు నెలల కూలి సొమ్ము జమ కాకపోవడంతో తాము పండుగ పూట పస్తులు ఉండాల్సిందేనా అని కూలీలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం స్పందించి కూలీలకు కూలి సొమ్ము వెంటనే జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



నాలుగు నెలల నుంచి కూలి సొమ్ము చేతికి అందకపోవడంతో ఎంతో ఇబ్బందిగా ఉంది. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులను నమ్ముకుని పని చేశాం. చేసిన పనికి కూలి చెల్లించకపోవడం సరైంది కాదు.

– ముద్దం లక్ష్మి, ఉపాధి కూలీ, గాంధ్లపేట్

వెంటనే కూలి సొమ్ము ఇవ్వాలి..



ఉపాధి కూలీలకు సొమ్మును వెంటనే జమ చేయాలి. నాలుగు నెలల నుంచి కూలీ చెల్లించకపోవడంతో దసరా పండుగకు చేతిలో నయాపైసా లేక ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం కూలి సొమ్మును అందించాలి.

– ఒల్లపు తిమ్మయ్య, ఉపాధి కూలీ, గాంధ్లపేట్

ఉన్నతాధికారులకు నివేదించాం..

కూలీలకు కూలి సొమ్ము బకాయిలు పేరుకపోయిన విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం. మే 22 వరకు కూలీలకు కూలి సొమ్ము చెల్లించారు. నాలుగు నెలల నుంచి నిధులు రావడం లేదు. కూలీలకు సొమ్ము రాకపోవడంతో వారు పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదు.

– నర్సయ్య, ఏపీవో, భీమ్‌గల్

ఆర్వోబీ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

- రోడ్డుపై గుంతలో కూరుకుపోయిన బస్సు
- అరగంటపాటు నిలిచిన ట్రాఫిక్

నిజామాబాద్ రూరల్/డిచ్‌పల్లి: నగర శివారులోని మాధవనగర్ ఆర్వోబీ వద్ద శనివారం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఆర్వోబీ రోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతోపాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వర్షపునీరు నిలిచి, గుంతలు కనిపించడం లేదు. కొందరు వాహనదారులు గుంతలను గమనించక వెళుతుండటంతో కొన్ని వాహనాలు దిగబడిపోతున్నాయి. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు దిగబడిపోవడంతో బైపాస్ నుంచి డిచ్‌పల్లి వైపు, డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వచ్చే వాహనాలు కిలోమీటర్ మేర నిలిచిపోయాయి. అరగంట పాటు వాహనాలు ఎటూ కదలక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు. నగరంలోని సారంగాపూర్ రహదారిపై సైతం గుంతల కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.



మాధవ్‌నగర్ ఆర్వోబీ వద్ద నిలిచిన వాహనాలు



సారంగాపూర్ రహదారిపై..

దుర్గామాత మండపాల తనిఖీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని దుర్గామాత మండపాలను శుక్రవారం అర్ధరాత్రి సీపీ సాయి చైతన్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా మండపం వద్ద ఏర్పాటు చేసిన పాయింట్ బుక్‌లను పరిశీలించి, పాయింట్ బుక్కులో నమోదు చేయబడిన నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని తెలియజేశారు. మండపం వద్ద ఉదయం, రాత్రి వేళలో ఇద్దరూ లేదా ముగ్గురు నిర్వాహకులు ఉండాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగజేసే ఎటువంటి చిన్న సమాచారాన్ని అయిన మీ దగ్గర లోని పోలీసులకు తెలపాలన్నారు. లేదంటే డయల్ 100కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 59700కు సమాచారం అందించాలన్నారు.

నియామకం

తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ సంస్థ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నేషనల్ గ్రీన్ క్రాప్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, అడవుల ప్రాముఖ్యత గురించి ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఈ నియామకం చేపట్టినట్లు డైరెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బతుకమ్మ పాట



శ్రీ గౌరీ పూజ ఉయ్యాలో
చేయబూనితిమి ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
కైలాస వాసివి ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
శంకరి పార్వతి ఉయ్యాలో
శంభుని రాణి ఉయ్యాలో
ధ్యానింతుమమ్మ ఉయ్యాలో
మమ్ములను కరుణించు ఉయ్యాలో
ఏటేటా పూజిస్తాం ఉయ్యాలో
మా ఊరు చల్లంగా చూడు ఉయ్యాలో
మనుసు పెట్టి ఉయ్యాలో
మనువంత నిన్ను చేసుకొని ఉయ్యాలో
నిండుగా మొక్కుతున్నాం ఉయ్యాలో
మమ్మేలు మా అమ్మ గౌరమ్మ ఉయ్యాలో

–ఉమారాణి వైద్య, అంగన్‌వాడీ టీచర్, లింగాపూర్, కామారెడ్డి

ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్

8332887332

మక్కలకు గడ్డు పరిస్థితి

- మొన్నటివరకు పంటకు మద్దతు ధర కరువు
- ప్రస్తుతం వర్షాలతో ఆరబెట్టిన మక్కలకు మొలకలు
- ఆందోళనలో అన్నదాతలు



సుంకెట్‌లో ఆరబోసిన మక్కలకు వచ్చిన మొలకలు

మోర్తాడ్(బాల్కొండ): మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులకు వరుసగా కష్టాలు వెంటాడుతున్నాయి. నిన్న మొన్నటి వరకు మక్కలకు ధరలేక అన్నదాతలు ఆందోళన చెందగా.. ప్రస్తుతం నిరాటంకంగా కురుస్తున్న వర్షాలతో పంటకు మొలకలు వచ్చి తీవ్ర నష్టం ఏర్పడుతుంది. వర్షాకాలం సీజన్‌లో మోర్తాడ్, బాల్కొండ, కమ్మర్‌పల్లి, వేల్పూర్, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్ తదితర మండలాల్లో మొక్కజొన్న పంటను ఎక్కువగా సాగు చేశారు. కానీ పంట కోత దశకు చేరుకున్న నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వర్షాలతో పంట తడిసిపోగా, ఆరబెట్టినా వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటంతో తొందరగా మొలకలు వస్తున్నాయి. దీంతోపాటు మక్కల ధర క్వింటాలుకు రూ.2,400ల నుంచి రూ.1,900లకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన మక్కలను వ్యాపారులు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో తడిసిన మక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కుళ్లుతున్న సోయా..



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సోయా పంటకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 33,603 ఎకరాల్లో సోయాను సాగు చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చేది. కానీ, ఆగకుండా వర్షాలు పడడంతో విత్తన కాయలు రంగు మారుతున్నాయి. దీంతో రైతులు సోయాపై ఆశలు వదులుకుంటున్నారు. ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి వస్తే అదే చాలనుకుంటున్నారు. వర్షాల కారణంగా సోయా పంట నష్టపోయిన వారికి పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

దిగుబడి వస్తుందో లేదో..

రెండు ఎకరాల్లో సోయా పంట సాగు చేశాను. కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బతింటోంది. వాన ఆగితేనే కోత కోయడానికి అవకాశముంది. దిగుబడి విషయానికి వస్తే ఎకరానికి ఐదు క్వింటాళ్లు కూడా వస్తుందో లేదో. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

–చిన్నారెడ్డి, గాదేపల్లి, డొంకేశ్వర్ మండలం

బీసీ కులగణన వివరాలు తెలపాలి



కులాచారి దినేష్ పటేల్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో డెడికేటెడ్ కమిషన్ ద్వారా చేసిన వెనుకబడిన తరగతుల (బీసీ) కులగణన వివరాలను తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తరఫున పూర్తిగా స్వాగతిస్తున్నామన్నారు. అలాగే బీసీ కులగణన నివేదిక వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ వివరాలు ప్రజలకు తెలిస్తేనే రిజర్వేషన్ల ప్రక్రియ ఎంత పారదర్శకంగా, సమానత్వంతో అమలు చేయనున్నారో తెలుస్తోందన్నారు.

జిల్లావాసికి ఇన్నోవేషన్ అవార్డు



డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పద్మానగర్‌కు చెందిన డాక్టర్ సింగం సుస్మితకు బెస్ట్ ఇన్నోవేషన్ ఐడియేషన్ అవార్డు లభించింది. వ్యవసాయ కీటక శాస్త్రంలో ఆమె పీహెచ్‌డీ చేయగా ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్ ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు రావడంపై ఆమె తల్లిదండ్రులు పోశెట్టి, లావణ్య సంతోషం వ్యక్తం చేశారు.

బోణీ కాని వైన్స్ టెండర్లు

ఖలీల్‌వాడి: జిల్లాలోని మద్యం షాపులకు ప్రభు త్వం టెండర్ నోటిఫికేషన్‌ను రెండు రోజుల క్రితం విడుదల చేసింది. అయితే ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోగల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్ర, శనివారం రెండు రోజులుగా మద్యం షాపులకు దరఖాస్తులు రాలేదు. రెండు రోజులుగా అల్పపీడనంతోపాటు బతుకమ్మ, దేవినవరాత్రులు ఉండటంతో వివిధ పనుల కారణంగా టెండర్లకు దరఖాస్తు చేయలేదని తెలుస్తోంది. సోమవారం నుంచి వైన్స్‌షాపులకు దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారుల ద్వారా తెలిసింది.

ప్రజల కోసమే పోరాటాలు చేస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- నగరంలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభ

నిజామాబాద్ సిటీ: కమ్యూనిస్టు పార్టీలెప్పుడూ ప్రజల కోసమే పోరాటాలు చేస్తాయని, ప్రపంచంలో ఎక్కడ చూసినా ఎర్రజెండా రెపరెపలాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షమైనా రాష్ట్రంలో సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో శనివారం ఏఐటీయూసీ 2వ రాష్ట్ర మహాసభ నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వార్థంలేని సిద్ధాంతాలున్న పార్టీ సీపీఐ అని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మార్కెట్‌యార్డును పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్కెట్ యార్డుకు పునర్జీవం వచ్చిందన్నారు. ఇళ్లులేని కార్మికులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇచ్చే ఏర్పాటుచేస్తానని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డులోని సమస్యలను పరిష్కరిస్తున్నామని, కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు, కార్మికుల కోసం ఉచిత భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. ఏఐటీయూసీ నాయకుడు ఓమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా కార్మికులకు తిప్పలు తప్పడం లేదన్నారు. పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. నాయకులు బాల్‌రాజ్, నర్సింహా, ప్రవీణ్, కంకర భూమయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మహిళా కార్మికులు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు

నిలకడగా ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, ప్రాజెక్ట్ నుంచి ఔట్‌ఫ్లోను సమానంగా చేయడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం శనివారం రోజంత నిలకడగా ఉంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 2లక్షల60 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి 39 వరద గేట్ల ద్వారా 2 లక్షల 50 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి , మిగిలిన నీటిని కాలువల ద్వారా వదులుతున్నారు. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టాన్ని పెంచకుండ నిలకడగా ఉంచారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 62.93 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 632 క్యూసెక్కుల నీరు పోతుంది. లక్ష్మి కాలువ , అలీసాగర్‌లిఫ్ట్, గుత్పలిఫ్ట్‌ల ద్వారా నీటి విడుదల నిలిపివేశారు.

క్రైం కార్నర్

కరెంట్‌షాక్‌తో బాలుడు మృతి



అభినయ్ (ఫైల్)

మాక్లూర్: తండ్రితో కలిసి పొలానికి వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామానికి చెందిన చింత ప్రవీణ్‌రెడ్డి అనే రైతు శుక్రవారం సాయంత్రం పొలానికి వెళుతుండగా, కుమారుడు చింత అభినయ్ (15) తాను వస్తానని చెప్పడంతో అతడిని తీసుకువెళ్లాడు. ప్రవీణ్‌రెడ్డి పొలానికి నీరు పెడుతుండగా కొద్ది దూరంలో ఉన్న కుమారుడు కరెంట్ మోటార్ వద్దకు వచ్చాడు. దీంతో అభినయ్‌కు కరెంటువైర్లు తగిలి, షాక్‌తో కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు కర్ర సాయంతో వైర్లను తీసివేసి, బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. కానీ అభినయ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు ..

నవీపేట: మండలంలోని బినోల గ్రామానికి చెందిన ముంత పోశెట్టి(56) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. పోశెట్టి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా జీవితంపై విరక్తి చెంది శుక్రవారం గడ్డి మందుతాగాడు. వెంటనే అతడు అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాటర్ ట్యాంక్ పైనుంచి పడి కార్మికుడికి గాయాలు

నిజామాబాద్ సిటీ: నగరంలో మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుడు వాటర్‌ట్యాంక్ పైనుంచి పడి గాయపడ్డాడు. వివరాలు ఇలా.. మున్సిపల్ కార్పొరేషన్‌లోని జోన్-4 వాటర్ వర్క్స్ విభాగంలో బింగి మధు అనే వ్యక్తి ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి వాటర్ ట్యాంక్ నిండిపోవడంతో అతడు వాటర్ లెవల్ చెక్‌చేస్తుండగా ప్రమాదవశాత్తూ ట్యాంక్ పైనుంచి జారి కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తోటి కార్మికులు జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మధును మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ శనివారం ఉదయం పరామర్శించారు. వైద్య ఖర్చులను సంబంధిత ఏజెన్సీ భరిస్తుందని తెలిపారు.

కిలో బంగారానికి రూ.7లక్షల జీఎస్టీ ఫైన్

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల పట్టుబడిన కిలో బంగారానికి రూ.7లక్షల జీఎస్టీ ఫైన్ వేసినట్లు అధికారులు తెలిపారు. నగరంలోని కంఠేశ్వర్ వద్ద ఈనెల 24న పోలీసులు తనిఖీలు చేయగా సరైన పత్రాలు లేకుండా రవాణా చేస్తున్న కిలో బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. సూర్యవంశీ సాంబాజీ అనే వ్యక్తి ఈ బంగారంను మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్ మీదుగా ఆర్మూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. దీనిపై జీఎస్టీ అధికారులకు మూడవ టౌన్ పీఎస్ నుంచి ఫిర్యాదు ఇవ్వడంతో జీఎస్టీ లేనందున రూ.7.08 లక్షలు జరిమానా విధించినట్లు చెప్పారు.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో కుక్కల దాడిలో లిఖిత్ చంద్ర (5) అనే చిన్నారి గాయపడ్డాడు. చిన్నారి శనివారం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడిచేశాయి. వెంటనే స్థానికులు గమనించి వాటిని తరిమేయడంతో ప్రమాదం తప్పింది. చంద్రను చికిత్స నిమిత్తం వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. జీపీ అధికారులు కుక్కల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నవీపేటలో చోరీ..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన దోమల రమేష్ ఇంట్లో శనివారం సాయంత్రం గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రమేష్ భార్య లలిత వంటింట్లో వంట చేస్తుండగా దుండగులు చొరబడి బీరువాలోని నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటికి బీరువా ఉన్న గదికి వచ్చిన బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



దగ్గి శివారులో రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన మంజూరు హుస్సేన్(47) అనే వ్యక్తి కొంత కాలంగా మార్కెటింగ్ వృత్తి చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం అతడు బైక్‌పై నిజామాబాద్ వైపు బయలుదేరాడు. దగ్గి దర్గా శివారులో అతడు ఎడమ వైపు ఉన్న టాటా ఏస్‌ని ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లగా, ముందు వెళ్తున్న భారీ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతడు కిందపడిపోయి, తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు హెల్మెట్ ధరించినప్పటికీ, సరిగా లేకపోవడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

కుప్రియాల్ గ్రామ శివారులో..

మండలంలోని కుప్రియాల్ గ్రామ స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కామారెడ్డికి చెందిన ముత్తినేని సూర్యరావు (రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్) కొన్నేళ్లుగా హైవేపై ఉన్న శ్రీ కృష్ణ ఉడిపి హోటల్‌లో పని చేస్తున్నారు. శనివారం ఉదయం అతడు కామారెడ్డి నుంచి తన ద్విచక్ర వాహనంపై హోటల్‌కు బయలుదేరాడు. కుప్రియాల్ శివారులో అతడిని హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న రెనాల్ట్ క్విడ్ కారు అతివేగంతో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



జక్రాన్‌పల్లిలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జక్రాన్‌పల్లి: మండలంలో పలు చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు డిచ్‌పల్లి సీఐ వినోద్ తెలిపారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. జక్రాన్‌పల్లిలో ఎస్సై మాలిక్ రహమాన్ తన సిబ్బందితో బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో పాత నేరస్తుడు, మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన కోనేటి నరేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని పోలీసులు పట్టుకొని విచారించారు. రెండు నెలల క్రితం నల్లగుట్ట తండాలోని ఆలయంలో హుండీ చోరీ, ఈనెల 17న సికింద్రాపూర్‌లోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు అతడు అంగీకరించాడు. అతడి బ్యాగులో ఉన్న ఇనుప రాడ్‌ను, అతడి వద్ద నుంచి 9 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై మాలిక్ రహమాన్, ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు జీవన్, రాజేశ్వర్ ఉన్నారు.

గుండెకు అండగా ఉందాం

DON'T MISS A BEAT రేపు వరల్డ్ హార్ట్ డే

ఈ ఏడాది 'వరల్డ్ హార్ట్ డే' థీమ్ 'ఒక్క స్పందననూ మిస్ కాకండి' (డోంట్ మిస్ ఏ బీట్) అని. అంటే... గుండెను రక్షించుకోవడంలో ఏ అవకాశాన్నీ వదులుకోవద్దనీ, గుండె ఇచ్చే వార్నింగ్ సిగ్నల్స్‌గానీ లేదా అదే చేసే హెచ్చరికలుగానీ ఏవీ మిస్ కాకుండా చూసుకోవాలనే సందేశాన్ని ఈ థీమ్ ఇస్తోంది. ఈ నేపథ్యంలో గుండె సంరక్షణ కోసం సీనియర్ కార్డియాలజిస్టులు... పాఠకులతో పంచుకుంటున్న అత్యంత కీలకమైన విషయాలివి.

భారతదేశంలో గుండెజబ్బుల విస్తృతి కాస్తంత బెంబేలెత్తించేలాగే ఉంది. గతంలో అంటురోగాల శకం ముగిసి, ఇప్పుడు జీవనశైలితో వస్తున్న 'నాన్ కమ్యూనికబుల్ జబ్బులు' విస్తరిస్తున్న శకంలో... అన్ని జబ్బులతో పోలిస్తే గుండెజబ్బుల వాటా తక్కువేమీ కాదు. పైగా అన్ని నదులూ పరుగెత్తేది సముద్రం వైపే అన్నట్టుగా... అన్ని జబ్బులూ నడిచేది గుండెజబ్బుల వైపే. ఉదాహరణకు అది డయాబెటిస్‌గానీ, హైబీపీగానీ, స్థూలకాయం, మెటబాలిక్ సింప్రోమ్స్ ఇవన్నీ పెరుగుతూ పెరుగుతూ చివర్న గుండెజబ్బుల దిశగా పయనిస్తున్నాయి. ఇక్కడ పేర్కొన్న ప్రతి జబ్బూ అది హార్ట్ ఎటాక్‌గానో, బ్రెయిన్ స్ట్రోక్‌గానో పరిణమించేదే అనడంలో సందేహం లేదు.

■ హృద్రోగం వృద్ధాప్య రోగం కాదు...

గతంలో గుండెజబ్బులనేవి కాస్తంత వయసు పెరిగాకే కనిపించేవి. ఇప్పుడు అవి కూడా చాలా త్వరితంగా వచ్చేస్తున్నాయి. ప్రత్యేకించి యువతలో సైతం కనిపిస్తున్నాయి. అందుకే చాలా సందర్భాల్లో వీటిని నిశ్శబ్ద ఉత్పాతాలు (సైలెంట్ ఎపిడెమిక్స్) అని కూడా నిపుణులు పేర్కొంటున్నారు.

■ ఆ తెలుగు వాడుక మాట అక్షరాలా నిజం...

మన తెలుగు వాడుక మాటల్లో 'గుండెల్ని పిండేసేలాగా...' అన్నది ఓ జాతీయం. ఒత్తిడి విషయంలో ఆ నుడికారం అక్షరసత్యం. ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ అది 'గుండెలను పిండేస్తుంది'!

మానసిక ఒత్తిడి అనేది ఓ భావోద్వేగపూరితమైన ఎమోషన్‌గా చెప్పడం సరికాదు. ఆ భావోద్వేగం కాస్తా తన భౌతిక లక్షణాలతో గుండెజబ్బుగానో, గుండెపోటుగానో కనిపించడం చాలా సాధారణం. ఎందుకంటే... మానసిక ఒత్తిడి పెరగగానే... రక్తనాళాల్లో రక్తపోటూ పెరుగుతుంది. రక్తపోటు కాస్తా గుండెపోటుగా పరిణమించడం మనకు తెలిసిన విషయమే. మనం సంప్రదాయంగా పాటించే కొన్ని అంశాల్లో దీనికి విరుగుడు దాగుంది. అవే... యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు. వీటి సాయంతో మన నరాలను హాయిపరచడం మొదలుపెట్టగానే... రక్తనాళాల్లో పోటెత్తే రక్తప్రవాహాన్ని అది జోకొడుతుంది. దాంతో బీపీ తన నార్మల్ ఒత్తిడికి వచ్చేస్తుంది. ఫలితంగా గుండెజబ్బుల ముప్పూ తప్పుతుంది. అందుకే ఇప్పుడు డాక్టర్లు కూడా మందులతోపాటు... ఈ మార్గాలూ ప్రిస్క్రిప్షన్‌లో సూచిస్తున్నారు.

■ డాన్సులూ డేంజరస్‌గా మారిన డేస్ ఇవి!

ఇప్పుడు న్యూస్ ఫాలో అవుతున్నవారికి తెలియని విషయాలేమీ కావివి. అవేమిటంటే... మంచి వయసులో ఉన్న యువత కూడా డాన్స్ చేస్తూనో, క్రికెట్ ఆడుతూ ఆడుతూనో, జిమ్‌లో వ్యాయమం చేస్తూనో యువతీ యువకులు కుప్పకూలిపోతున్నారు. దీన్ని నివారించదగిన అంశాలూ ఉన్నాయి. ఉదాహరణకు ఎక్కువ శక్తిని ఒకేసారి ఇచ్చే హై-ఎనర్జీ డ్రింకులూ, వ్యాయామంతోపాటు స్టెరాయిడ్స్ తీసుకుంటున్న ఉదంతాలూ, ఒకే చోట కూర్చుని చేసే వృత్తివ్యాపకాలూ, చురుగ్గా కదలడానికి అంతగా ఇష్టపడని జీవనశైలీ... ఇవన్నీ ఇలా ఆకస్మికంగా గుప్పెడంత గుండెను కుప్పకూల్చే ముప్పును పెంచుతున్నాయి. వీటి నివారణ చాలా సింపుల్. క్రమం తప్పకుండా చేసుకునే కొన్ని సాధారణ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలతో పెద్ద పెద్ద గుండె ముప్పులనూ నివారించుకోవచ్చు. అలా నిబ్బరంగా, నిశ్చింతగా ఉండవచ్చు.



డా. ఎంఎస్ఎస్ ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

■ నివారణ చాలా సింపుల్... అదే టైమ్‌లో బోలెడంత పవర్‌ఫుల్...

నిజానికి గుండెజబ్బుల నివారణ చాలా చాలా సింపుల్. మనం సంకల్పంతో నిలిపేయగలిగే పొగతాగే అలవాటు, మద్యం అలవాట్లనుంచి దూరంగా ఉంటే చాలు. అదే సమయంలో అన్నంలో తగినన్ని ఆకుకూరలూ, కాయగూరలతో పాటు తాజా పండ్లు తీసుకోవడం వంటి మంచి రుచికరమైన మార్గంలో వెళ్లడం ద్వారా గుండెజబ్బుల్ని సమర్థంగా నివారించవచ్చు. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడి తగ్గించుకోవడం, రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవడం, బరువు ఆరోగ్యకరమైన లిమిట్‌లోనే ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమైనవి. ఇక్కడ కాస్తంత కష్టమైనదైనా కన్సిస్టెంట్‌గా అంటే క్రమం తప్పకుండా పై అలవాట్లను కొనసాగించడంతో గుండె ఆరోగ్యాన్ని పదికాలాలపాటు పదిలంగా పదిలపరచవచ్చు.

■ గాలినీ, కలుషితాలనూ తేలిగ్గా తీసుకోకండి...

మనం పీల్చే గాలి శుభ్రంగా ఉండేలా చూసుకోవడం కూడా ముఖ్యమే. అంటే... వాహనాల పొగతో లేదా కాలుష్యంతో కూడిన గాలిని పీల్చుకోవడాన్ని వీలైనంతగా తప్పించుకోవాలి. వాటిలో ఉండే కాలుష్యపదార్థాలు, ధూళిదూసరాలూ రక్తనాళాల్లో రక్తప్రవాహాన్ని వేగవంతం చేస్తాయి. అలా గుండెజబ్బులూ వేగంగా వచ్చేలా చేస్తాయి. కాలుష్యం పెరిగిన కొద్దీ రక్తం తాలూకు ఎరుపు రంగు డేంజర్ మార్క్‌లా కనిపిస్తుంది. అదే వీలైనంతగా పచ్చటి పరిసరాల్లోనే ఉండటం ప్రారంభిస్తే గుండె ఆరోగ్యమూ పదికాలాలు పచ్చగా ఉంటుంది.

■ మహిళల గుండెలకు మరింత ముప్పు...

మహిళలు కుటుంబ ఆరోగ్యానికి ప్రాథమ్యం ఇచ్చి, చాలావరకు తమ ఆరోగ్యానికి రెండో ప్రాధాన్యమిస్తారు. వారు తమలో కలిగే అలసటను ఇంటి పనులతో వచ్చిన నీరసంగా అనుకుంటారు. తమ అజీర్ణ సమస్యను గ్యాస్ సమస్యగా భావిస్తారు. తమ గుండెనొప్పిని ఛాతీనొప్పిగానే తీసుకుంటారు. ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగున్నట్టుగా వాళ్ల గుండె బాగుంటేనే మిగతా ఇంటి సభ్యుల గుండె సంస్పందనలూ బాగుంటాయి. 'డోంట్ మిస్ ద బీట్' అనే థీమ్‌ను తమకు అనువుగా ఆలోచిస్తే.. మహిళలకే అది ఎక్కువగా అనువర్తిస్తుంది.

■ అనుక్షణం... రక్షణకు అనువైన క్షణమే...


ఆకస్మిక గుండె జబ్బు ముప్పు నుంచి కాపాడాలంటే అనుక్షణం అనువైన క్షణమే. అందుకే గుండెజబ్బు లక్షణాలు కనిపించినప్పుడు దాన్నుంచి రక్షించాలంటే ప్రతి ఒక్కరూ కార్డియాక్ పల్మనరీ రిససియేషన్ అనే సీపీఆర్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఎవరైనా గుండె పట్టుకుని కుప్పకూలిపోతే ఒకచేతి వేళలలో మరో చేతి వేళ్లు దూర్చి క్షణం కూడా ఆలస్యం చేయకుండా గుండెపై క్రమబద్ధంగా, లయబద్ధంగా, నేర్పుగా కదిలిస్తూ 'సీపీఆర్' నిర్వహించే నైపుణ్యాలను నేర్చుకోవాలి. అది ఇల్లూ, వాకిలీ, పనిప్రదేశం ఇలా ఎక్కడైనా, ఎవరైనా అభ్యసించగల సింపుల్‌గా చేయగలిగే ఈ ప్రాణరక్షణ నైపుణ్యం చేతుల్లో దాగి ఉండే అభయహస్తాలవుతాయవి.

■ చివరగా...

మనం పుట్టిన నాటి నుంచీ క్షణం కూడా ఆగకుండా... ఒక్క బీట్ కూడా మిస్ కాకుండా ఒక జీవిత కాలం పాటు సంస్పదిస్తూ ఉండే ఆ గుండెను గౌరవిస్తూ... దాన్ని మాటువేసి కాటు వేసే అన్ని రకాల అవాంతరాల నుంచి కాపాడుకోడానికి టిక్కు టిక్కుమని భయపడకుండా ఉండటానికి గడియారంలో టిక్కు టిక్కుమనే ఏ బీట్‌నూ మిస్ కాకుడదంటూ లబ్‌డబ్ మంటూ స్పందించే 'హార్ట్' డే థీమ్‌కు భాష్యం చెప్పుకోవాలి.

హెల్త్

నిర్వహణ: యాసీన్



● యంగ్ ఇండియా! బీ(ట్) కేర్‌ఫుల్

లబ్... డబ్... లయ తప్పొద్దు!

ప్రపంచవ్యాప్తంగా గుండెజబ్బులు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అందునా ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ తన విశృంఖల ప్రతాపం చూపాక గుండెజబ్బుల కేసులు మరింత ఎక్కువయ్యాయి. అందుకే ప్రతి ఏడాదీ సెప్టెంబరు 29న నిర్వహించే వరల్డ్ హార్ట్ డే తాలూకు థీమ్ ఏమిటంటే... "ఒక్క స్పందననూ మిస్ కావద్దు" (డోంట్ మిస్ ఏ బీట్). దీని అర్థం ఏమిటంటే... ఒక్క గుండె కూడా తన స్పందనలను కోల్పోయే పరిస్థితి రాకూడదనే. గతంలో కనీసం 50, 40లలో కనిపించే ఈ గుండెజబ్బులు ఇప్పుడు ఎందుకిలా యుక్తవయసులోనే వచ్చేస్తున్నాయో చెప్పే కారణాలూ, వాటిని నివారిస్తూ మన యువతను గుండెజబ్బుల నుంచి రక్షించుకునేందుకు తగిన అవగాహనను కల్పించేందుకే ఈ కథనం.

గుండెజబ్బుల తీవ్రతనూ, విస్తృతినీ తెలిపే కొన్ని గణాంకాలను చూద్దాం. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్‌లలోని కొన్ని పెద్ద హాస్పిటల్స్ తాలూకు ఎమర్జెన్సీ కేసులను పరిశీలిస్తే సగానికి పైగా కేసులు... అంటే 50% కేసుల్లో బాధితులు కేవలం 40 ఏళ్లలోపు వాళ్లే. మానసిక ఒత్తిడి, ఎటూ కదలకుండా (శారీరక శ్రమ లేకుండా) ఉండే వృత్తులూ పెరగడంతో గుండె జబ్బులతో బాధపడే యువత కూడా పెరుగుతోంది. అందుకే ఇటీవల కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ 45 ఏళ్ల లోపే అక్యూట్ కరోనరీ సిండ్రోమ్‌తో బాధపడేవారిపై పరిశోధనల కోసం ఓ అధ్యయన కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటీవలి పరిశీలనల ప్రకారం ప్రతి ఐదు గుండెపోటు కేసులను పరిశీలిస్తే అందులో ఒకరు తప్పనిసరిగా 40 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. గుండెజబ్బుల పరంగా ప్రపంచవ్యాప్తంగా 20 – 30 ఏళ్ల యువతలో ఏడాదికి 2% పెరుగుదల ఉండగా... మన దేశంలో సైతం గుండెజబ్బులకు లోనైన వాళ్లలో 40 ఏళ్ల లోపు వారు కనీసం 25% వరకు ఉండటం మరింతగా బెంబేలెత్తిస్తున్న అంశం. హైబీపీ, హైకొలెస్ట్రాల్ వంటివి యువతలో పెరుగుతుండటమే దీనికి కారణం. దాంతో క్రమంగా, నిశ్శబ్దంగా చాపకింద నీరులా గుండెజబ్బుల కేసులు భారత్‌లోనూ పెరుగుతున్నాయి.

లక్షణాలు... సాధారణంగా చాలామందిలో ఛాతీనొప్పితో గుండెపోటు కనిపిస్తుంది. ఈ లక్షణం కనిపించే వారు 97.3 శాతం మంది, చెమటలు పట్టడం 11 శాతం మందిలో, వాంతులు లేదా వికారం 8.2 శాతం కేసుల్లో, శ్వాస ఆడకపోవడం 6.8 శాతం మందిలో కనిపిస్తాయి. ఈ వయసులో చాలా మందిలో వచ్చే గుండెపోటుకు కారణమైన నొప్పిని గ్యాస్, అజీర్ణం, అసిడిటీ కారణంగా భావిస్తుంటారు. ఈ అంశం కూడా చికిత్స ప్రారంభించడాన్ని ఆలస్యం చేస్తోంది.

నివారణ ఇలా... కార్డియో వాస్క్యులార్ హెల్త్ స్కోరుకు దగ్గరగా ఉండే జీవనశైలి: సాధారణంగా పాశ్చాత్యదేశాల్లో... మరీ ముఖ్యంగా అమెరికా వంటి చోట్ల అమెరికన్ హార్ట్ అసోసియేషన్ నిర్దేశించిన కొన్ని జీవనశైలి మార్గదర్శకాలు ఉన్నాయి. వాటినే 'లైఫ్ ఎసెన్షియల్స్ 8 (ఎల్ఈ 8); లైఫ్ ఎసెన్షియల్స్ 7 (ఎల్ఈ 7)గా వ్యవహరిస్తుంటారు. అంటే... ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా అనుసరించే మార్గదర్శకాలైన... రక్తపోటును (హైబీపీని) అదుపులో ఉంచుకోవడం; రక్తంలో చక్కెరమోతాదులనూ, కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవడం; ఆరోగ్యకరమైన ఆహారాన్ని, పోషకాహారాన్ని తీసుకోవడం; తగినంత వ్యాయామం చేయడం; ఎత్తుకు తగినంత బరువు ఉండేలా బాడీ మాస్ ఇండెక్స్- (బీఎమ్ఐ)ను మెయింటెయిన్ చేయడం; స్మోకింగ్ / నికోటిన్‌కు దూరంగా ఉండటం; కంటినిండా నిద్రపోవడం... అలాంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం ద్వారా ఈ లైఫ్ ఎసెన్షియల్ స్కోరును ఎంతగా పెంచుకుంటే గుండెజబ్బులను అంతగా నివారించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ● **అర్లీ వార్నింగ్ సిగ్నల్స్ ద్వారా :** చాలామందిలో గుండెజబ్బులుగానీ లేదా గుండెపోటుగానీ ఆకస్మికంగా రాకముందే కొన్ని వార్నింగ్ సిగ్నల్స్ పంపుతాయి. ఉదాహరణకు ఛాతీలో ఇబ్బందిగా ఉండటం, తీవ్రమైన నీరసం, నిస్సత్తువ, అలసట, గుండెదడ (పాల్పిటేషన్) వంటివి. వాటిని నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో గుర్తించి డాక్టర్లను సంప్రదించడం వల్ల. ● **స్క్రీనింగ్ పరీక్షలతో :** హైబీపీ, అధిక కొలెస్ట్రాల్, మధుమేహంతో బాధపడేవారు తగిన పరీక్షలు చేయించుకోవడం, ఏవైనా లక్షణాలు కనిపిస్తే కరోనరీ సీటీ యాంజియోగ్రామ్ వంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండెజబ్బులు నివారించవచ్చు.



డాక్టర్ అంజని ద్వారంపూడి
సీనియర్ కార్డియాలజిస్ట్

గుండె జబ్బుల పెరుగుదలకు కారణాలు...

● **వయసు పెరుగుతుండటం:** ఇది నివారించలేని అంశం. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ మృదువుగా ఉండాల్సిన రక్తనాళాలు గట్టిబారుతుంటాయి. దీన్నే అథెరోస్క్లిరోసిస్ అంటారు. గతంలో సాధారణంగా 40 ఏళ్లకు పైబడ్డాక ఈ పరిణామం సంభవిస్తుండేది. ఇప్పుడు ఈ వయసు కంటే ముందే.. అంటే 20 నుంచి 30 ఏళ్లలోపే ఇలా రక్తనాళాలు గట్టిబారడం కనిపిస్తోంది. కొందరిలో కొలెస్ట్రాల్ నిల్వలు చాలా నెమ్మదిగా రక్తనాళాల్లోకి చేరుతుంటాయి. కానీ కొందరిలో చాలా వేగంగా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఇలా పేరుకునే కొవ్వును 'ప్లాక్'గా వ్యవహరిస్తుంటారు. ఈ ప్లాక్ రక్తనాళాల్లోకి ఎక్కువగా చేరడం వల్ల ధమనులు/రక్తనాళాలు సన్నబడి, గుండె కండరాలకు రక్తప్రసరణ తగ్గిపోతుంది. ఈ ప్లాక్ ఎక్కువగా చీలిపోయి క్లాట్స్ (అడ్డంకులు)గా మారి ఆకస్మికంగా గుండెకు రక్తసరఫరా తగ్గవచ్చు. ఫలితంగా గుండెపోటు రావచ్చు.

● **ఆహారపు అలవాట్లు:** హైలీ ప్రాసెస్‌డ్ ఫుడ్ తీసుకోవడం వంటి మారుతున్న ఆహారపు అలవాట్లు, ఉప్పు, చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలు చిన్న వయసులోనే గుండెజబ్బులు / గుండెపోటుకు దారితీసే ముప్పును పెంచుతున్నాయి. మన దేశంలో దిగువ, మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ఉండే దేశాల్లో పెరుగుతున్న పట్టణీకరణ / నగరీకరణ కారణంగా అన్ని పోషకాలు ఉండే మంచి ఆహారంతో పోలిస్తే అధిక క్యాలరీలు ఉండే ఆహారం చవగ్గా దొరుకుతుండటంతో గుండెజబ్బుల ముప్పు పెరుగుతోంది.

● **తగినంత వ్యాయామం లేకపోవడం :** కుదురుగా కూర్చుని చేసే వృత్తులు పెరగడం ప్రపంచవ్యాప్తంగా చోటు చేసుకుంటున్న అంశమే అయినప్పటికీ... మన దేశ యువతలో కూడా వ్యాయామం లేకపోవడమూ, పైగా మన దేశ సాంస్కృతిక, సామాజిక నేపథ్యం కారణంగా మహిళలు, అమ్మాయిల్లో వ్యాయామ సంస్కృతి తక్కువగా ఉండటం కూడా గుండెజబ్బులు / గుండెపోటు ముప్పునకు కారణమవుతోంది.

● **పొగతాగడం :** ఇటీవల భారత్, రష్యా, కొన్ని మధ్య ఆసియా దేశాల్లో పొగాకు వినియోగం బాగా పెరుగుతుండటం అథెరోస్క్లిరోసిస్‌కూ, గుండెపోటుకు మరో ప్రధాన కారణం. 60 ఏళ్ల వ్యక్తులతో పోలిస్తే 40 ఏళ్లలోపు వారికి పొగ దుష్ప్రభావం మరింత ఎక్కువ. అయితే ఏ వయసులోనైనా పొగతాగడం అంతే ప్రమాదకరం అని గుర్తించాలి.

● **స్థూలకాయం కారణంగా :** మన దేశవాసుల్లో ఊబకాయం ఎక్కువగా పొట్ట దగ్గర వస్తుంది. దీన్నే అబ్డామినల్ ఒబేసిటీ అంటారు. మన జీవనశైలి (లైఫ్ స్టైల్) కారణంగా ఇలా స్థూలకాయం రావడం, పొట్ట దగ్గర కొవ్వు పెరగడం కూడా గుండెజబ్బుల ముప్పును మరింత పెరిగేలా చేస్తోంది.

● **హైబీపీ, డయాబెటిస్ :** లైఫ్‌స్టైల్ జబ్బులైన హైబీపీ, డయాబెటిస్ వంటి అనారోగ్యాల విషయంలో అవగాహన అంతగా లేని మన లాంటి దేశాలలో నియంత్రణలో లేని హైబీపీ, మధుమేహం వంటివి గుండెపోటుకు కారణమవుతున్నాయి.

● **జెండర్ అంశం :** ఒక వయసు వరకు మహిళలతో పోలిస్తే గుండెపోటు వచ్చే అవకాశాలు పురుషుల్లో ఎక్కువ. రుతుస్రావం ఆగిపోయే వరకు మహిళల్లోని ఈస్ట్రోజెన్ వారికి ఒక రక్షణ కవచంగా ఉంటుంది. అయితే రుతుక్రమం ఆగాక మహిళలతో పాటు... ఏ జెండర్ వారికైనా గుండెపోటు అవకాశాలు సమానం.

● **సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలు:** పై అంశాలకు తోడుగా ఒక సమాజంలోని విద్య, ఆదాయ వనరులు, ఆరోగ్య సంరక్షణకు గల అవకాశాలు, సాంస్కృతిక నేపథ్యాల వంటి అంశాలు కూడా గుండెజబ్బుల కేసులను ప్రభావితం చేస్తుంటాయి.

● **ఫ్యామిలీ హిస్టరీ :** మిగతావారితో పోలిస్తే గుండెజబ్బులు / గుండెపోటు లాంటివి వచ్చిన వారి కుటుంబాల తాలూకు కుటుంబ ఆరోగ్య చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) కూడా గుండెజబ్బుల ముప్పునకు ఒక ప్రధాన కారణం. మిగతావాళ్లతో పోలిస్తే దాదాపు 25 శాతం మంది రోగుల్లో గుండెపోటుకు ఈ ఫ్యామిలీ హిస్టరీనే కీలకాంశమవుతుంది.

సాక్షి ఫ్యామిలీ
నిజామాబాద్
ఆదివారం ॥ 28-9-2025

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసిచూడు.. అని సామెత. రెండూ జటిలమైనవేనని అర్థం. ఇంటి కోసం అప్పు చేసినా తప్పు లేదు. అదొక నీడగా మిగులుతుంది. కానీ పెళ్లి? కంపాటబులిటీ కుదిరితే కుటుంబంగా స్థిరపడుతుంది. లేదంటే చేదుజ్ఞాపకంగా వెంటాడుతుంది. అయినా అంతా బాగుంటుందనే ఆశతో ఏడడుగుల ప్రయాణానికి సిద్ధపడినా.. దానికోసం లక్షలకు లక్షలు అప్పు చేయాల్సిన అవసరం ఉందా అని! ఇప్పుడు పెళ్లి ఖర్చును వధూవరులిద్దరే పెట్టుకుంటున్నారు. అది వాళ్లిద్దరి జీవితాలకు తీరని రుణంగా పరిణమించి.. ఈఎమ్ఐల రూపంలో జీతాలనే మింగేస్తోంది. దాని గురించే ఈ కథనం..



● మూడు ముళ్లు... ఆరు వాయిదాలు

E -ఈక్వల్ M -మ్యారేజ్ I -ఇన్‌స్టాల్‌మెంట్

సాత్విక్‌ది మార్కెటింగ్ జాబ్, మానస ఒక కార్పొరేట్ కంపెనీలో లీడ్ రోల్‌లో ఉంది. వీళ్లది పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా, డెస్టినేషన్ వెడ్డింగ్. దాదాపు 80 లక్షల రూపాయలకు పైనే ఖర్చయింది. ఆ భారం ఇరువైపుల తల్లిదండ్రుల మీద పడకుండా వీళ్లిద్దరే షేర్ చేసుకున్నారు. సేవింగ్స్ నుంచేనా ఖర్చు చేసింది అని అడిగితే.. ట్వంటీ పర్సెంట్ సేవింగ్స్, ఎయిటీ పర్సెంట్ లోన్ అనే చెప్పారు ముక్తకంఠంతో. పెళ్లయి మూడేళ్లవుతోంది. ఆ ఖర్చుకు ఇంకా ఈఎమ్ఐ చెలిస్తునే ఉన్నారు. ఆ లోన్ తీరేదాకా పిల్లలు వద్దు అనుకుంటున్నారట. ఆ మాటతో మానస వాళ్ల మామ్మ హతాశురాలైంది. ఇదెక్కడి చోద్యమంటూ విచారపడింది.

> మన మ్యారేజ్ ఇండస్ట్రీ ఏటా కోటి పెళ్లిళ్లతో 10.79 లక్షల కోట్ల టర్నోవర్‌గా పురోగమిస్తోంది. ఫుడ్ అండ్ గ్రాసరీ తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ప్రధాన, ప్రభావవంతమైన ఇండస్ట్రీగా విరాజిల్లుతోంది.

సర్వేలే సాక్ష్యం

'ఇండియా లెండ్స్' చేసిన సర్వే మేరకు సొంత ఖర్చుతోనే పెళ్లిచేసుకోవాలనుకుంటున్న 26 శాతం అమ్మాయిలు, అబ్బాయిలు.. ఆ ఖర్చును పర్సనల్ లోన్‌తో భర్తీ చేసుకుంటున్నారట. వాళ్లలో చాలామంది పెళ్లికి సంబంధించి ఒక్క ఈవెంట్‌కే రూ. లక్ష నుంచి రూ. అయిదు లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దీని మీదే వెడ్డింగ్‌వైర్ ఇండియా అనే సంస్థ చేసిన అధ్యయనంలో ఒక్క నిరుడే మన దేశంలో పెళ్లి ఖర్చు అమాంతం రూ. 29.6 లక్షలకు చేరినట్టు తేలింది. పెళ్లి జంటల్లోని మూడోవంతు జంటలు తమ పెళ్లికి రూ. 30 లక్షలకు పైనే వెచ్చిస్తుంటే మిగిలిన జంటలు రూ. 50 లక్షలకు పైగా ఖర్చుపెడుతున్నారని ఆ సర్వే నివేదిక.

అప్పులు బారెడు... జీతం మూరెడుగానే!

డబ్బు ఖర్చు పెట్టడం చాలా ఈజీ. కూడబెట్టడమే బహు కష్టం. రూ. లక్ష సమకూర్చుకోవడానిక్కూడా కనీసం ఏడాది పడుతుంది. అలాంటిది మూడు లేదా అయిదురోజుల పెళ్లిలోని ఒక్కో వేడుకకు రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల దాకా పెట్టే ఖర్చు జీవితానికి ఎంత భారమవుతుందో తెలుసా! ఆ అప్పు తీర్చడానికి ఆ జంటలు.. అప్పుడే పిల్లల్ని వద్దనుకోవడం దగ్గర్నుంచి ఇల్లు, ఇతర స్థిర, చరాస్తులను సమకూర్చుకోవడం దాకా అన్నిటినీ వాయిదా వేసుకుంటున్నారు. అపార్ట్‌మెంట్ డౌన్‌పేమెంట్‌కి పనికొచ్చే డబ్బును, భవిష్యత్ ప్రణాళికలను.. ఆఖరకు ఇన్సూరెన్స్ పాలసీలను సైతం బ్రేక్ చేసి మరీ పెళ్లి బట్టలు, ఈవెంట్ డెకరేషన్ కోసం చేసిన అప్పు తీరుస్తున్న జంటలున్నాయి. ఇలా ఆ లోన్ వాళ్ల పెళ్లిని మధుర జ్ఞాపకంగా మలచకపోగా సంసారాన్ని చింతల చితిగా మారుస్తోంది.

క్రైసిస్‌లో కాపురాలు

దరఖాస్తుదారుల క్రెడిట్ స్కోర్‌ను బట్టి వెడ్డింగ్ లోన్స్, పర్సనల్ లోన్స్ ఏడాదికి పది నుంచి 24 శాతం దాకా మంజూరవుతున్నాయట. వీటికి కట్టలేకుండా పేరుకుపోయిన ఈఎమ్ఐల వడ్డీ వచ్చి చేరి.. ఎంత జీతం వచ్చినా, అత్యవసరాలకే ఎసరు వస్తోంది. ఈ క్రైసిస్ కాపురంలో కలతలను రేపుతోందంటున్నారు ఫ్యామిలీ కౌన్సెలర్లు. పెరుగుతున్న రుణభారాన్ని తీర్చడానికి ఓవర్ టైమ్, పార్ట్‌టైమ్ జాబ్‌ల కోసం వెదుక్కుంటున్న జంటలూ ఉన్నాయి. నెల తిరిగేసరికల్లా వచ్చే ఈ ఈఎంఐల ఒత్తిడి తట్టుకోలేక భార్యాభర్తల డైనింగ్ టేబుల్ కాన్వర్జేషన్స్ కలహాలతో ముగుస్తున్నాయి. ఎడమొహం పెడమొహంగా ఉదయాలు మొదలవుతున్నాయి.

అప్పు తప్పు కాదు కానీ..

లోన్ తీసుకోవడంలో తప్పులేదు. కానీ ఎందుకు తీసుకుంటున్నాం.. దేనిమీద ఖర్చు పెడుతున్నామనే ఎరుక, స్పష్టత చాలా అవసరం అంటున్నారు ఆర్థికవిశ్లేషకులు. ఇల్లు కట్టుకోవడానికో, వ్యాపారం ప్రారంభించడానికో, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించే చదువుకోసమో అప్పు చేయడం సబబే. కానీ.. పైసా రాబడి లేనిచోట అప్పు చేసి మరీ డబ్బును వెదజల్లడం తెలివైన నిర్ణయం కాదని చెబుతున్నారు. పరస్పర గౌరవ మర్యాదలు, సర్దుబాట్లు, ప్రేమాభిమానాలతో పెళ్లి చేసుకోవాలి. మంచి కుటుంబంగా స్థిరపడాలి. కానీ ఆడంబరాల వేడుకగా.. ఫొటోలు, వీడియోలతో కనిపించే అప్పుగా కాదని సూస్తున్నారు ఆర్థికనిపుణులు, విశ్లేషకులు, ఫ్యామిలీ కౌన్సెలర్లు. కలలు సాకారమవ్వాల్సిందే! మధురమైన జ్ఞాపకాలను క్రియేట్ చేసుకోవాల్సిందే! కానీ ఈ రెంటికి మూల్యం మన జీవితం కాకూడదు! అప్పుడే సాకారమైన కలలు మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

దేశవ్యాప్తంగా ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇస్తూ టెంపుల్ డ్యాన్సర్‌గా పేరుతెచ్చుకుంది విజయవాడవాసి కూచిపూడి నృత్యకారిణి కావ్య కంచర్ల. దసరా నవరాత్రుల సందర్భంగా తన విద్యార్థులతో కలిసి అమ్మవారి రూపాలను వివిధ ఆలయాలలో నృత్యరూపకాలుగా ప్రదర్శిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కేరళ తరంగ్‌లో పాల్గొని విజేతగా నిలిచారు. గిన్నిస్‌బుక్ రికార్డ్‌లోనూ చోటు సంపాదించారు. నృత్యం ద్వారా తమ శక్తిని ఎలా ప్రదర్శిస్తారో ఈ సందర్భంగా వివరించారు.

నృత్యార్చనం



నవశక్తి

"దసరా నవరాత్రులలో అంతటా అమ్మవారే కనిపిస్తుంటారు. ఇక విజయవాడలోనే కొలువైన అమ్మవారికి చేరువలో ఉంటూ నృత్యం ద్వారా సేవ చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడ ఉన్న వివిధ ఆలయాలకు ముందుగానే అప్లికేషన్స్ ఇచ్చాం. వారు ఇచ్చిన టైమ్ ప్రకారం నృత్యం ప్రదర్శనలు ఇస్తున్నాం.

అలసట తెలియదు

నవరాత్రుల మొదటి రోజు నుంచి ఈ రోజు వరకు ఆరు ప్రదర్శనలు ఇచ్చాం. అమ్మవారి మీద ఎన్నో గీతాలు ఉన్నాయి. వాటిలో ఒక్కో గీతాన్ని ఒక్కో ఆలయంలో మాకు ఇచ్చిన సమయం వరకు ప్రదర్శన ఇస్తున్నాం. పూర్తయ్యాక పెద్ద వయసున్నవారు కూడా ఏమాత్రం సంకోచించకుండా మమ్మల్ని కలిసి 'ఆ అమ్మవారే నృత్యం చేస్తున్నారా అనే భావన కలిగింది' అని చెప్పినప్పుడు కలిగే ఆనందం మాటల్లో వర్ణించలేనిది. ఒక తొంభైఏళ్ల బామ్మగారు ప్రదర్శన పూర్తయ్యాక వచ్చి తన చిన్నప్పుడు నేర్చుకున్న ఆలాపన ఇప్పుడు గుర్తుకు వచ్చిందని భావయుక్తంగా పాడి వినిపించారు. 'ఆ అమ్మవారు ఈ రూపంలో నాకు కనిపించారు' అని పొంగిపోయారు. ఇలాంటి ఎన్నో అనుభూతులను ప్రతిసారీ మేం పొందుతుంటాం. మా దగ్గర నృత్యం నేర్చుకునే విద్యార్థులు కూడా 'అమ్మవారి నృత్యంలో అలసట ఎందుకు రాదు' అని అడుగుతుంటారు. నృత్యం ఒక యాక్టివిటీ కాదు దైవికంగా ఎంత దగ్గరవుతుంటామో ఈ నృత్యం మాకు స్పష్టం చేస్తుంటుంది.

విజయవాడ అంటేనే అమ్మవారు. దసరానవరాత్రుల్లో ఆలయాల్లో మేం నృత్యం చేయడం అంటే అమ్మకు దగ్గరగా ఉన్నట్టే. ఒక భక్తి పూర్వక ప్రార్థన. మా నృత్యాన్ని అమ్మ చూస్తుంది అనే భావనతోనే చేస్తాం. 'ఎంతసేపు నృత్యం చేసినా అలసటగా ఎందుకు అనిపించడం లేదు?' అని మా విద్యార్థులు అడుగుతుంటారు. ఆధ్యాత్మికంగా అమ్మవారికి దగ్గరగా ఉంటే మరేమీ తెలియదు.

అమ్మవారి ప్రతి రూపం మనకు ప్రేరణ ఇచ్చే పాఠమే. మన జీవన విధానానికి ఎంతగానో తోడ్పడేదే. ఆ శక్తిని మేం నృత్యం ద్వారా ప్రదర్శించడమే కాదు మేమూ పొందుతుంటాం. సేవ చేస్తున్న కొద్దీ శక్తి పెరిగేదే. శ్రీశైలం, తిరుపతి, శిరిడీ, మహానంది, భద్రాచలం, హరిద్వార్, కేదార్‌నాద్, బదిరీనాద్... ఇలా మనదేశంలోని ప్రముఖ దేవాలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లభించింది. వందల, వేల మంది ముందు ప్రదర్శనలు ఇస్తుంటాం కాబట్టి ధైర్యం పెరుగుతుంది. మధురమైన మాటతీరు, ఏకాగ్రత.. ఇలా ఎన్నో పాజిటివ్ అంశాలు పెరుగుతాయి. రోజూ సాధన చేయడం వల్ల శారీరక ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ఆనందం కలుగుతుంది. వీటన్నింటి వల్ల జీవనశైలి కూడా బాగుంటుంది.

బీఎస్సీ కంప్యూటర్స్‌లో డిగ్రీ, నృత్యంలో డిప్లొమా చేశాను. మా అమ్మ మాధవికి కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. నాలుగేళ్ల వయసు నుంచి నాకు నృత్యం నేర్పించారు. ఐదేళ్ల వయసు నుంచి ప్రదర్శనలు ఇస్తున్నాను. అకాడమీ పెట్టి, నృత్యసేవను కొనసాగిస్తూ ఉండాలని మా నాన్న కల. నాన్న వెంకట రత్నకుమార్ కరోనాలో మాకు దూరమయ్యారు. నాన్న కలను నెరవేర్చడానికి 'పంచమవేద' అకాడమీ ద్వారా కృషి చేస్తున్నాను. జాతీయ స్థాయి నృత్య పోటీ అయిన కేరళ తరంగ్‌లో పాల్గొన్ని విజేతగా నిలిచాను. ఇప్పటి వరకు 1500 కు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. గ్రూప్‌గా చేసిన శతనృత్య యాగంలో పాల్గొనే అవకాశం రావడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ లో చోటు దక్కింది. ఎంతో సాధన చేస్తూ శక్తిని పెంచుకోవడానికే ఈ నృత్య సేవ చేస్తున్నాను' అని వివరించారు ఈ నృత్యకారిణి.

– **నిర్మలారెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి